



ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ జమున-లింగయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి ఉన్నారు.



## 30తో ముగియనున్న పథకం గడువు

# స్మార్ట్ సిటీ సంగతేంటి ?

- కేంద్రం పొడిగిస్తేనే నిధుల మంజూరు
- అప్పడే గ్రేటర్ వరంగల్‌లో అభివృద్ధి పనులు ముందుకు
- ఇప్పటికి సగం మాత్రమే పూర్తి.. మేజర్ ప్రాజెక్టులన్నీ అసంపూర్తే
- రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తేనే పొడిగించే అవకాశం



**చారిత్రక వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన స్మార్ట్‌సిటీ పథకం భవితవ్యం గందరగోళంలో పడింది. జూన్ 30తో ఈ పథకం అమలు గడువు ముగుస్తుండగా కేంద్రం పొడిగిస్తుందా? లేదా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన పనులు సగం మాత్రమే పూర్తి కాగా, మేజర్ ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉన్నాయి. మరో ఏడాది పాటు ఈ పథకాన్ని పొడిగించకుంటే అన్నీ మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తేనే కేంద్రం గడువు పొడిగించే అవకాశం ఉంటుంది.**

- వరంగల్, జూన్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

వరంగల్ నగరానికి స్మార్ట్‌సిటీ పథకం గడువును మరో ఏడాది పొడిగించేందుకు కృషి చేయాలని గ్రేటర్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం పొడిగింపు ఇవ్వకుంటే పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు, ఇంకా ప్రారంభించాల్సిన ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటనే ఆందోళన నెలకొంది. స్మార్ట్‌సిటీ పథకం కింద గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.948 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటివరకు కేంద్రం రూ.528 కోట్లు విడుదల చేసింది. రూ.505 కోట్లు ఖర్చు చేయగా, రూ.23 కోట్లు కార్పొరేషన్ వద్ద నిల్వ ఉన్నాయి. వారం రోజులక్రితం కేంద్రప్రభుత్వం రూ.56 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.56 కోట్లు విడుదల చేస్తే రూ.112 కోట్లు గ్రేటర్ ఖజానాకు చేరుతాయి. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 77 అభివృద్ధి పనులు చేపట్టారు. అవి నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికి సగం మాత్రమే పూర్తయ్యాయి. మేజర్ ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉన్నాయి. నగరానికి వన్నె తెచ్చే మేజర్ ప్రాజెక్టులన్నీ స్మార్ట్‌సిటీ నిధులతోనే చేపట్టారు. మరో ఏడాది స్మార్ట్‌సిటీ పథకాన్ని పొడిగించకుంటే అన్నీ మధ్యలోనే ఆగిపోయే అవకాశం ఉంది.

### ఆగిపోనున్న నిధులు

స్మార్ట్‌సిటీలో భాగంగా కేంద్రం వాటా 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం, ఆయా మున్సిపల్ కార్పొరేషన్ వాటా 25శాతం భరించాల్సి ఉంటుంది. కార్పొరేషన్‌ది కలిపి 50శాతం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నది. స్మార్ట్‌సిటీ పథకం గడువు జూన్ 30న ముగుస్తున్నది. కేంద్రం పొడిగింపునకు అవకాశం కల్పిస్తే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు విడుదల చేస్తాయి. పొడిగించకుంటే కేంద్రం నిధులు ఆగిపోతాయి. అప్పుడు పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నవి పూర్తయ్యేందుకు రూ.400 కోట్లు కావాలి. ఆధునిక సాంకేతికతతో రూ.100 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ కమాండ్ సెంటర్ పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.70 కోట్లతో చేపట్టిన భద్రకాళీ బండ్ రెండో దశ సుందరీకరణ పనులు సగమే పూర్తయ్యాయి. వడ్డేపల్లి బండ్ సుందరీకరణ, బయోమైనింగ్ పనులు సైతం స్మార్ట్‌సిటీ పథకంలోనే చేపట్టారు. నగర ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ కమాండ్ సెంటర్, భద్రకాళీ, వడ్డేపల్లి బండ్‌ల సుందరీకరణ, ఎస్‌టీపీ, నగరం నలువైపులా జాతీయ రహదారులపై గ్రాండ్ ఎంట్రెన్స్ పనులు పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తేనే స్మార్ట్ సిటీ పథకం గడువు పొడిగింపు ఉంటుంది. పనులు పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుంది.



కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

# వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రేపు కలెక్టరేట్‌లో సీఎం సమీక్ష
- మంత్రి కొండా సురేఖ

హనుమకొండ, జూన్ 27 : వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్ నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధాని వరంగల్ నగర అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుంచి నేరుగా హెలీక్యాప్టర్ ద్వారా వరంగల్‌లోని కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ చేరుకొని సందర్శిస్తారని, అక్కడే ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారన్నారు. అనంతరం వరంగల్ సెంటర్ జైల్ ఆవరణలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి సమీక్షిస్తారని తెలిపారు. ఆ తర్వాత వరంగల్ నగర అభివృద్ధిపై( కుడా పరిధిలో) హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే కలెక్టరేట్‌లో ప్లాంటేషన్‌తో పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారన్నారు. అలాగే స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా చేపట్టినవి, ప్రగతిలో ఉన్నవి, ఇంకా చేపట్టాల్సిన పనులపై రివ్యూ చేస్తారని తెలిపారు. సమీక్షలో ముఖ్యంగా వరంగల్ పాత మాస్టర్‌ప్లాన్‌ను మార్చాల్సిన అవసరం ఉందని, సకాలంలో పూర్తి కాని కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు నిధులు మంజూరు చేయాలనే అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబుల్, వాటర్ సమస్యలను సైతం సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి ప్రాముఖ్యతను వివరించనున్నట్లు చెప్పారు. ప్రధానంగా వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, వరంగల్ కార్పొరేషన్ కొత్త భవన నిర్మాణం, వెటర్నరీ యూనివర్సిటీ ఏర్పాటు, ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధి, స్టేడియం ఏర్పాటు, దేవునూరు గుట్టలను ఎకో టూరిజంగా అభివృద్ధి, అలాగే ఖిలా వరంగల్‌ని మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే అంశాలను సైతం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ఎంజీఎంలోని సమస్యలను సైతం సీఎంకు వివరించి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే మామునూర్ ఎయిర్‌పోర్టు అంశాన్ని సైతం సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి సురేఖ పేర్కొన్నారు. హైదరాబాద్-వరంగల్ వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌గా మార్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

### అధికారులతో సమీక్ష

మీడియా సమావేశానికి ముందు హనుమకొండ కలెక్టరేట్‌లో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదా, కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, ఇతర ఉన్నతాధికారులతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క సమావేశమయ్యారు. వరంగల్ నగర అభివృద్ధి, సీఎం పర్యటన సందర్భంగా సమీక్షించాల్సిన ఎజెండా అంశాలపై చర్చించి, పర్యటన ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రొటోకాల్‌ను జాగ్రత్తగా పర్యవేక్షించడంతో పాటు ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.



# అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి మోక్షం కలిగేనా?

## దశాబ్దాలుగా నగరవాసులకు కలగానే..

- అసంపూర్తిగా నగర అభివృద్ధి
- ఈసారీ వరద ముంపు తప్పదా?
- కాగితాల్లోనే 'కుడా' మార్క్ పనులు

వరంగల్, జూన్ 27 : మహా నగరంలలో ఏళ్ల తరబడి అభివృద్ధి పనులు సాగుతూనే ఉన్నాయి. మేజర్ ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. వరంగల్ ప్రజలను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ దశాబ్దాలుగా ఊరిస్తూ డీపీఆర్‌ల స్థాయిలోనే ఆగిపోతున్నది. స్మార్ట్‌సిటీ పనులు సగంలోనే ఉన్నాయి. ఏ ఒక్క అభివృద్ధి పనీ పూర్తి కాలేదు. రాష్ట్రంలోనే రెండో పెద్ద నగరంగా చెప్పుకునే వరంగల్ అభివృద్ధి ముందుకు సాగడం లేదు. స్మార్ట్, అమృత్, హృదయ్ వంటి కేంద్ర పథకాల్లో నగరానికి చోటు దక్కినా ఆశించిన ప్రగతి జరుగలేదు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అభివృద్ధి అంతా కాగితాల్లోనే కనిపిస్తోంది. నగరంలో జంక్షన్ల అభివృద్ధి మినహా కుడా చేపట్టిన పని ఒక్కటీ పూర్తి కాలేదు. ఇన్నర్ రింగ్‌రోడ్, నియో మెట్రో మధ్యలోనే ఆగిపోయాయి. ముఖ్యం గా 2047 విజన్‌లో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ది అయోమయ పరిస్థితి. మార్పులు, చేర్పుల మధ్య ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది.

### ఊరిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ..

నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం ఏళ్ల తరబడి అంచనాలు చేసి ప్రభుత్వాలకు పంపించడంతోనే సరిపోయింది. తొలుత రూ.400 కోట్లతో చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంచనాలు ప్రస్తుతం రూ.2200 కోట్లకు చేరినట్లు సమాచారం. ఇప్పటికీ ఇది ఎన్నికల హామీగా మిగిపోయింది. 24 విలీన గ్రామాలతో నగర విస్తీర్ణం 407.71 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. స్మార్ట్‌సిటీగా చెప్పుకుంటున్న వరంగల్ మహా నగరం ప్రతి ఏడాది వరదల్లో మునుగుతోంది. వందలాది గృహలు, వేలాది మంది ప్రజలు వరదల్లో చిక్కుకున్ని అవస్థలు పడుతున్నారు. ఈ వర్షాకాలంలోనూ నగరానికి వరద ముంపు తప్పేట్లు లేదు. గతేడాది చేపట్టిన నాలాల విస్తరణ పనులు ఇంకా పూర్తి కాలేదు. చారిత్రక వరంగల్ నగరం శాశ్వతంగా వరద ముంపు నుంచి విముక్తి చెందాలంటే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాల్సిన అవసరం ఉంది.

### ఇన్నర్ రింగ్ రోడ్డు..

కుడా ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు లొల్లి తెగడం లేదు. దశాబ్దకాలంగా ఇన్నర్ రింగ్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ కొలిక్కిరాలేదు. కేవలం 8 కిలోమీటర్ల మేర చేసిన భూ సేకరణ అంతా గందరగోళంగా మారింది. నాయుడు పెట్రోల్ పంపు నుంచి ఎనుమాముల రెండో గేట్ వరకు చేపట్టిన భూసేకరణలో ఇంకా అనేక మంది రైతులకు డబ్బులు చెల్లించలేదు. ఇప్పటికి చాలామంది రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రెండో గేట్ నుంచి కొత్తపేట మీదుగా ఆరెపల్లి ఔటర్ రింగ్ రోడ్డు వరకు భూ సేకరణ కొత్త విధానంతో ముందుకు సాగడం లేదు. ఫిఫ్టీ.. ఫిఫ్టీ పద్ధతిలో భూసేకరణ చేస్తామన్న కుడా అధికారుల ప్రతిపాదనలను రైతులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. అక్కడి రాకుండా అడ్డుకున్నారు.

### స్మార్ట్ అంతా సగం సగం..

స్మార్ట్‌సిటీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ సగం సగం పూర్తయ్యాయి. ట్రాఫిక్, తాగునీటి సరఫరాతో పాటు అనేక స్మార్ట్ సేవలు అందిందుకు రూ. 100 కోట్లతో మొదలు పెట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ), బల్దియా చెత్త సమస్యకు పరిష్కారం చూపేందుకు చేపట్టిన బయోమైనింగ్ ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ఇంకా కొన్ని పనులు మొదలు కాలేదు. రోడ్లు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఐదేళ్ల స్మార్ట్‌సిటీ పథకం గడువు ముగుస్తున్నా అభివృద్ధి పనులు అలాగే ఉన్నాయి.

### కాగితాల్లోనే కుడా అభివృద్ధి..

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చేసిన అభివృద్ధి అంతా కాగితాల్లోనే కనిపిస్తోంది. నగర జంక్షన్ల అభివృద్ధి మినహా నగరంలో కుడా ఎక్కడా లేదు. ఇన్నర్ రింగ్ రోడ్డు, మాస్టర్ ప్లాన్, నియో మెట్రో రైల్, ఆక్సిజన్ పార్క్, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఏ ప్రాజెక్టునూ పూర్తి చేసింది లేదు.

## కేసీఆర్ కృషితోనే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

# వస్త్ర పరిశ్రమకు భరోసా దక్కేనా?

- మౌలిక వసతుల కోసం రూ.700 కోట్లు మంజూరు
- ఇప్పటికే పార్కులో మూడు పరిశ్రమల కార్యకలాపాలు
- కాంగ్రెస్ సర్కారు దృష్టి పెట్టాలంటున్న స్థానికులు
- అసంపూర్తి పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి
- రేపు పార్కును సందర్శించనున్న సీఎం రేవంత్

గీసుగొండ, జూన్ 27 : లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా 2017లో కేసీఆర్ సర్కారు వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు శ్రీకారం చుట్టింది. 1350 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడగా, మౌలిక వసతుల కల్పనకు రూ.700 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే మూడు పరిశ్రమలు తమ కార్యకలాపాలు ప్రారంభించగా మరికొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈక్రమంలో ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన పార్కుపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది. పార్కు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానికులు భావిస్తున్నారు. శనివారం పార్కును సీఎం రేవంత్ రెడ్డి సందర్శించనున్న నేపథ్యంలో నిలిచిన పనులను పూర్తి చేయడంతో పాటు పరిశ్రమలకు భరోసా కల్పించాలని వారు కోరుతున్నారు.

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటలో ఏర్పాటుచేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మణిహారంగా నిలిచింది. 2017లో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కృషితో 1350 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ పార్కుకు శంకుస్థాపన చేయగా, అదే రోజు వివిధ దేశాలు, రాష్ట్రాల వస్త్ర పరిశ్రమలతో ఎంవోయూ చేసుకున్నారు. అందులో మూడు పరిశ్రమలు తమ నిర్మాణాలు ప్రారంభించి పూర్తిచేసుకున్నాయి. కొవిడ్ కారణంగా కొన్ని పరిశ్రమలు రాలేకపోయాయి. పార్కులో మౌలిక వసతుల కల్పన కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.700 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో భూసేకరణ, రోడ్ల నిర్మాణాలు, సైడ్ డ్రైన్స్, విద్యుత్, నీటి సౌకర్యం, సెంట్రల్ లైటింగ్, అండర్ బ్రిడ్జిలు, సేకరించిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణాలు చేపట్టగా అందులో కొన్ని పూర్తికాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వం పార్కుపై ప్రత్యేక దృష్టి సారించగా, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అనునిత్యం సమీక్షలు చేస్తూ ఇతర రాష్ట్రాల్లోని పరిశ్రమలను ఒప్పించి ఇక్కడికి వచ్చేలా చేశారు. పార్కు కోసం సేకరించిన భూమిలో 1200 ఎకరాలను వివిధ పరిశ్రమలకు కేటాయించారు. మిగతా 46 ఎకరాల స్థలాన్ని పార్కుకోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్లు చేసి ఇచ్చేందుకు సిద్ధం చేశారు. మరో 56 ఎకరాల భూమిని చేనేత, వస్త్ర పరిశ్రమలకు 750 గజాల చొప్పున ఇచ్చేందుకు లేఅవుట్ చేశారు. మిగతా భూమిని పరిశ్రమల సామాజిక అవసరాల కోసం కేటాయించారు. పార్కులో ఇప్పటికే గణేషా ఎకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 50 ఎకరాలు కేటాయించగా, రూ.500 కోట్ల పెట్టుబడితో నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. గతేడాది అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఉత్పత్తిని ప్రారంభించి కొనసాగిస్తున్నది. ఈ పరిశ్రమలో 600మంది పనిచేస్తున్నారు. కిటెక్స్ పరిశ్రమ 191 ఎకరాల్లో రూ.1500 కోట్ల పెట్టుబడితో నిర్మాణం ప్రారంభించి 80 శాతం పనులను పూర్తి చేసుకొని త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇందులో 13వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ పరిశ్రమకు 297 ఎకరాల భూమిని కేటాయించారు. రూ.1000 కోట్ల పెట్టుబడితో ఈ పరిశ్రమ తన నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నది. ఇప్పటికే ఒక షెడ్ నిర్మాణం పూర్తి చేసిన యాజమాన్యం అందులో పనిచేసేందుకు 7వేల మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నది. పార్కుకు ఎగుమతులు, దిగుమతుల కోసం చింతలపల్లి వద్ద రైల్వే ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. గత బీజేపీ ప్రభుత్వం పీఎం మిత్రలో ఈ టెక్స్‌టైల్ పార్కుకు చోటు కల్పించింది. దీంతో అప్పటి, ఇప్పటి కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం పార్కులో అభివృద్ధికి రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు టీజీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ తెలిపారు.





కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటైన గణేశ ఎకోటెక్ పరిశ్రమ





మేడిగడ్డ బరాజ్ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు



# మేడిగడ్డ బరాజ్‌కు వరద తాకిడి

## ఇన్‌ఫ్లో 8,790 క్యూసెక్కులు, దిగువకు విడుదల

మహదేవపూర్, జూన్ 27 : ఎగువన కురుస్తున్న వర్షాలతో మేడిగడ్డ బరాజ్‌కు వరద వస్తోంది. గురువారం 8,790 క్యూసెక్యులు రాగా, అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ రక్షణ చర్యలో భాగంగా ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలమేరకు గ్రౌటింగ్, షీట్ ఫైల్స్ పనులు పూర్తికాగా, అప్ అండ్ డౌన్ స్ట్రీమ్‌లో చేపట్టిన సీసీ బ్లాక్ రీ అరేంజ్‌మెంట్ పనులు తుది దశలో ఉన్నాయి. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లకు 84 ఎత్తి ఉంచగా, ఏడో బ్లాక్‌లోని 20వ గేట్ కటింగ్ చేసి విడిభాగాల తొలగింపు పనులను గురువారం పూర్తిచేశారు. బరాజ్ రక్షణ చర్యల్లో భాగంగా ఎన్‌డీఎస్ఏ ఆదేశాల మేరకు చేపట్టిన గ్రౌటింగ్, సీకెంట్ ఫైల్స్ పనులు పూర్తి కాగా బరాజ్ అప్, డౌన్ స్ట్రీమ్‌లో చేపట్టిన సీసీ బ్లాక్ రీ అరేంజ్‌మెంట్ పనులు తుది దశలో ఉన్నాయి. బరాజ్ వద్ద పనులను భారీ నీటి పారుదల శాఖ ఈఈ తిరుపతిరావు పరిశీలించారు.

### సమ్మక్క బరాజ్ 32 గేట్లు ఎత్తి నీటి విడుదల

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకుల గూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి వరద ప్రవాహం రోజురోజుకు పెరుగుతున్నది. గురువారం ఎగువ నుంచి గోదావరిలోకి 9,700 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో 32 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సీఎం రేవంత్ పర్యటన రేపటికి వాయిదా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి, సీపీ అంబర్ కిశోర్‌ఝా

హనుమకొండ, జూన్ 27 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటన శనివారానికి వాయిదా పడింది. శుక్రవారం వివిధ అభివృద్ధి పనుల పరిశీలన, సమీక్ష నిర్వహించాల్సి ఉండగా ఆ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. టూర్ షెడ్యూల్ కూడా ఖరారు కాగా, చివరి నిమిషంలో వాయిదా పడింది. తొలుత విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పరిశీలన, హనుమకొండ కలెక్టరేట్ మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్ష నిర్వహించాల్సి ఉంది. ఈ కార్యక్రమాలన్నీ ఈ నెల 29కి వాయిదా పడ్డాయి.

### పార్కులో కలెక్టర్, సీపీ ఏర్పాట్ల పరిశీలన

గీసుగొండ : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి, సీపీ అంబర్ కిశోర్‌ఝా, సీఎం వ్యక్తిగత భద్రతా సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్‌తో పాటు ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో దత్తు, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, డీసీపీ రవీందర్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.